
# బోర్‌వెల్ బైరప్ప

**కె.ఎన్.టి.శాస్త్రి**

దండాల్సామి. నా పేరు బైరప్ప. అందరూ నన్ను బైరిగాడు అనే పిలిచేవాళ్లు, ఈ వూర్లో! నా పెండ్లాన్నడుగు, బైరిగాడి పెండ్లామంటాది. నా కొడుకు నడుగు బైరిగాని కొడుకే అంటాడు.

ఎవురెట్లా పిలిస్తె నాకేం... ముమ్మొందుకు నాకు వేరు మంచి పేరు కాక్కోని కూర్చోంది, అని నాకే తెలియదప్పా...!

మా యప్ప నాకు మిగిల్చింది ఐదెకరాల చేను! వులవులు- అనప గింజలు- శనక్కాయిలూ, రాగులూ బాగా ఒగప్పుడు పండేది... నాగలే లేదప్పా... నీళ్ళకు ఏంచేయాలో తెలియదని అనుకుంటుంటే, పటేల్ శామన్న మా బావి నుండి నీళ్ల తోడుకోమని అన్నడు. ఆ బావిలో కూడ ఏం లేదు... వాళ్ల పంపుసెట్టు వేయించుకుని, మాగ్గూడ కొంచెం నీళ్ల పారిస్తుండిరి. పోతాపోతా ఆయప్ప, 'నువ్వే కరెంటు పెట్టుకో. నాకు కొంచెం రుపయిలు ఇచ్చేయని చెప్పాడు. సర్లె- ఆఖరకు రాగులూ, శనక్కాయలైనా పంట చేసుకుందామని కసువుతో నిండిపోయిన చేనులో సేద్యం చేయటాన్కి ఒప్పుకున్న. శీనిగాడు, అదే నా కొడుకు, వెళ్లి- ఈ నేల మీద శనక్కాయిలు నాటాడు. విత్తనాలు కూడా మన పలమనేరు బ్యాంకిలో అప్పు తీసుకుని వచ్చి... అక్కడే శ్రీనివాసపురం సంతలో అమ్ముతూ వుంటే తీసుకొచ్చాడు.



మడక కట్టి దున్నం.ఆ ఎద్దులు కూడ మంచి కసువూ కుడితి లేక దున్నటాన్కి నిక్కి నీలుగుతూంటే, రామకుప్పం నుండి వచ్చిన పెద్దాయన చూసి, "బైరప్పా-ఈ ఎద్దులు ఈపొద్దో, రేపో సచ్చేట్టుంది... మా వూరి నుంచి ఎడ్లను తోలుకు రావచ్చు గదప్పా... దీన్ని ఆ షేక్‌సాయిబ్‌కిచ్చి నరికించేయవచ్చు గదప్పా..." అని అంటే ఈ యప్పకు నాపై ఎందుకింత దయ అని అర్థంకాలేదు. కాని, ఆ సాయంత్రమే విషయం అర్థమైంది. రామకుప్పం నుండి మునసబు రామయ్య, గోపాలప్ప అందరూ వచ్చి, "మాలచ్చిమిలాంటి బిడ్డ. శీనిగాడికి చేసుకో....ఆ బిడ్డ కోసరం, ఈ గొడ్డుల్ని కూడ ఇద్దామనుకుంటామన్న నప్పా" అంటే... ఇంటిలో శీనిగాడి నుణువు మీసాలు గుర్తొచ్చినాయి. వాడు అప్పుడే పెండ్లీడుకు వచ్చేసాడా అని నవ్వుకున్నాను.

"ఏం సావీ, నేనెంత? నా తాహతెంత? పొద్దు పుట్టిన కాణ్నించి, పొద్దు పొయ్యేంక ఆ శీనిగాడు గొడ్లను మేపి, కుడితి దాపి, ఇంటెనుక కట్టేసి, కసువేసి, పేడెత్తి, ఓ ముద్ద సంకటి తినే గతి. రాగులూ ల్లేవు, శనక్కాయిలూ లేదు. ఒగప్పుడు అనపకాయిలు ఎంత బాగా పండేయి? సంగటికి కూడ కరువే..." ఈ గతిలోనున్న మాకు ఈ పెద్దాయన బిడ్డ ఇస్తానంటే, దీనిలో ఏం కసరత్తు దాగుందో?" అని నోరు పారేసుకున్నా. "బైరా... అక్కడ మా వూర్లో కూడా అంతే!" అంటూ చేతిలోకి వక్కాకు, చెండు మల్లెపువ్వులూ, టెంకాయి పెట్టి- "లగ్గం, గుట్టపల్లె వెంకటసామి గుడిలో చేసేద్దాం. మా వూరి బాతన్న అయ్యోరే వచ్చి పసుపుతాడు కట్టించుతాడు" అంటే, నేను ఒట్టేసుకున్న. ఇగో ఈ పొద్దే, ఆ బిడ్డను పిల్చుకుని వస్తారు...

పెండ్లి బాగానే చేసారు. నాకూ కొత్త పంచె ఇచ్చారు. బాగానే వుందనుకుని బీడి వెలిగించుకుని బండికోసం ఎదురుచూస్తూంటే, అగో- వచ్చే వచ్చారు.ఆ గొడ్లే మాకిస్తారంట. "కానీ ఈ వయస్సులోని బిడ్డలు ఎక్కడ పండుకుంటారు. ఉన్నదొక్క కొటడీనాయె!" ఆ ఎడ్లబండిని చూసినప్పట్నించి, నాకు చానా దిగులుగా వుంది! ఆ బిడ్డ పేరు పద్మ... మావాడు అదృష్టం చేసిన నాయాలు! లేకపోతే ఈ లచ్చిమీదేవిలాంటి బిడ్డ ఈ పేడతొప్పులు ఎత్తుకునేవాడికి సిక్కుతుందా? వచ్చినవాళ్లందరూ ఆ సాయంకాలమే పండుగ వంట చేసుకుని తిని, వూరెల్లిపోయారు. ఈ బిడ్డను ఇక్కడ విడ్చిపెట్టి! ఇగిత్తంగా వుంటుంది. బిడ్డకు పెండ్లి మాత్రం. చేయాలే. ఆ బిడ్డను అత్తోరింటిలో- అన్నట్టు నా పెండ్లాం చచ్చిపోయి నాలుగెల్లాయె. ఇంక అత్తోరెక్కడిది? విడ్చిపెట్టి వెళ్లేటప్పుడు అంత ఎడుపులు? ఇంకా ఇచిత్రం- రాత్రి మగడు పెండ్లాం పడకమీదికి చేరినప్పుడే ఈ ఆడబిడ్డలు ఎంత బేగ మర్చిపోతారు, ఆ కన్నోరిని!

వాళ్ల అమ్మ ఉంటానన్నా, నేనే, ఉన్నది ఒక్క కొట్టడి, వయస్సులోనున్న బిడ్డలు- ఆళ్లకు మనమెందుకు అడ్డం, ఊరికెళ్లండమ్మా మీ బిడ్డను మేము చూసుకుంటాం అని, వాళ్ల వెళ్లుతూంటే మీసాలు సవరించుకుని కూకున్న- బీడిలు కూడ్ష లేవప్పా!

ఆ రాత్రి నా పడక బయటే... అరుగుమీద గజ్జికుక్కొకటి ఎప్పుడూ పడుకునుండేది. దాన్ని తోలి అక్కడే ఓ జమ్కాన వేసుకుని చుక్కల్ని చూసుకుని పండాను."ఈ బిడ్డ ఈ గుడిసెలో ఏం సుఖం చూత్తుందో, మరి!" అని నసుగుతుంటే, లోపట్లోంచి వస్తున్న శబ్దాలు మాత్రం నా పెండ్లాంను గుర్తుకు తెచ్చాయి.

మాంచి నిద్ర. అలారం శబ్దం. శీనిగాడికి, పటేల్ శామన్న ఇచ్చిన గడియారం... అప్పుడే రెండైంది. రెండుకు లేచి, చేను దగ్గరికెళ్లి పంపు వేచి, శామన్న చేనుకూ, మా చేనుకు నీళ్ల పెట్టాలె. మర్చి నిద్రపోతిమొ, ఇంక నీళ్ల వుండవు. వానల్లేవు! ఈ నీళ్లతోనైనా కొంచెం రాగులు పండుతుందేమొనన్న ఆశ! ఆ కరెంట్ వాళ్ల రోజు మూడు గంటలు రాత్రికే వేస్తారు. మళ్లీ ఐదుకల్లా కరెంట్ తీసేస్తారు.

కథ

కొత్తగా పెండ్లాడినవాళ్లు, ఆ బిడ్డను అలా వదిలి వెళ్లుతుంటే, "నేను పొయ్యి వేసొస్తాను లేరా" అని అన్నా, శీనిగాడు బయల్దేరి వెళ్లిపోయాడు. నేను నిద్రలోకి వెళ్లిపోయాను.

పొద్దుగూకుతుంది. ఏదో సబ్దాలు. లేచి కూర్చుని అటు చూస్తుంటే "అయ్యో, మళ్లీ పాము కర్సింది" అని ఎవరో నాయాల్ను తీసుకొస్తున్నారు. ఈ కరెంట్ వాళ్ళకు బుద్దేమైనా ఉందా అని? ఈ నడి రాత్రివేళ కరెంట్ వేసేదేమి? మళ్లీ పొద్దుగూకేలోగా తీసేదేమి? రాత్రిళ్లు పాములు చేనులో పారుతూ వుంటే, దాన్ని తొక్కి, దానిచేత కాటేయించుకుని, ఇట్లా చచ్చిపోవుటమేమి? అని ననుక్కుంటూ వెళ్లిచూచొచ్చినా? ఈ సింత మాకులపల్లెలో ఎంతమంది ఇలా చస్తారో ఏమొ. ఏ నాయాలూ అడిగే దిక్కు లేదు!

మరుసటి దినం... రేతిరి రెండులో గంట కొట్టింది. చేనుకు కోడలు బిడ్డ కూడ కొడుకుతో ఆ నడిరేతిరి వెళ్లింది. నేను వొద్దని చెప్పా. మాట వింటేకదా? "లేదప్పా... ఒక్కతే వుండేదాన్కి భయమంట" అంటూ ఆ బిడ్డను కూడ శీనిగాడు తీసుకెళ్లాడు. నాకేమొ భయం- ఏ పామొ, పురుగో కరిస్తే? నేనూ కొంచెంసేపు అయిన తర్వాత వెళ్లా. శామన్న బావి దగ్గరున్నాడు. "భైరప్పా... నీళ్లసలు లేవు. కరెంటూ రాలేదు ఈ పొద్దు. మన గింజల్ను కాకులో గువ్వలో తినిపోతాయి- అంతే" అంటూ, ఎండిపోతున్న రాగుల పైరును చూస్తూ అన్నాడు.

అప్పుడే అనుకొన్న- ఈ పసిబిడ్డలు ఇలా రాత్రిళ్లు లేచి, పాములూ, పురుగులు చేత కర్పించుకుని నీళ్లు పారించాలా? అ కరెంటు ఇన్స్పెక్టర్ దగ్గరెల్లి మాటాడాల. శామన్ననూ వూర్లోని, మునిసామప్ప, రామప్పనూ అందర్నీ తోల్కొని, పోయి మాట్లాడాలె! ఆ పొద్దున్నె 11 గంటలకల్లా ఆ కరెంట్ ఆఫీసు దగ్గరికెళ్లితిమి.

దుడ్లకన్నా నాకు ముఖ్యం నా కూతురు. దానిపేరు భైరమ్మా! ఈ భైరమ్మను నేను సదివిస్తా... ఈ చేనును, ఈ నీళ్లను ఇగ నమ్మనంటే నమ్మను. ఆ బిడ్డ చదివి నన్నెక్కడైనా దూరంగా పట్నంలోనున్న నా మగడి దగ్గరికి చేర్చుతుందనే గట్టి నమ్మకమప్పా!

కాని అదేమైందోనప్పా! అది ఒక చెడ్డ వేళ... మాటామాటా పెరిగి... ఆ కరెంట్ ఇన్స్పెక్టర్‌పై కిరసనాయిల్ పోసి నిప్పంటించేసాం! నల్లగా మాడి మసై పడిపోయాడు. "ఇంకేమప్పా... ఇట్లా... రేతిరి మూడుగంటలకూ- నాలుగ్గంటలకూ కరెంట్ వేసేదేమి? పాణాలు తీసేది? ఎందరు చావాలే, ఈ నాయాల్ల నుంచీ...? ఆ కరెంటుకు దుడ్లు వేరంట? అందరూ గొణుక్కున్నారు. పోలీసు నాయాళ్లు మాత్రం, దీనికి నేనూ, మునిసామప్పే కారణమని నన్ను జైల్లోకి తోసేసారు.

పాపం శీనిగాడ్ని, ఆ బిడ్డ పద్మని తలుచుకుని అక్కడ ఇచ్చే గంజి తాగుతూ...అప్పుడప్పుడూ ఈ బిడ్డలిద్దరూ పండుగా పబ్బమని, సంకటి లేదా బబ్బుట్లూ లేదా అనపకూర ఇలా తీసుకొచ్చి నాకిస్తూ వుండేరు. వానలే పడిందో, పంటలే పండిదో పద్మ కడుపులో మాత్రం ఒక పురుగు పుట్టిందని చెప్పారు. నేనూ జైలు నుండి వచ్చేసాను. కొట్టెసారంట కేసును... నేను తప్పు చేయలేదంట. మునసామప్ప నడిమింటి నారాయణప్పే కిరోసిన్ పోసి నిప్పంటించారని, వాళ్లను వదల్లేదు. తప్పు చేయలేదన్నారు గాబట్టి, నాకు కాస్త పరపతి పెరిగింది మన వూర్లో.

ఇంటికొచిన రోజే అనుకున్న, ఇంగ నీళ్లకు ఎదో చేయాలెనని! చిత్తూరు దగ్గర ఎదో తెల్లోళ్ల కంపెనీకి నీళ్లు తొడ్కొవటాన్కి బోర్‌వెల్లు- అంటే గొట్టం బావులు తవ్వుతున్నారనీ, శీనిగాడ్ని వెళ్లి కనుక్కురమ్మన్నాను. "భలే చెప్పావప్పా! మన చేను కుదువపెట్టి దుడ్లు దీసుకుంటే, బావి వేయించుకోవచ్చు" అని నా చేత ఒప్పించి దుడ్లు తీసుకొచ్చాడు. వాడెవడో వచ్చి టెంకాయి చేతిలో పెట్టుకుని చేనంతా తిరిగి, ఇగో ఈడ నీళ్లున్నయెమొగాని, ఆడెక్కడ నీళ్లు- రాతినేల" అంటే, లేదంటే లేదని నాయాళ్లు అక్కడ బావి తవ్వటానికి గుర్తు చేసారు. ఆపైన జరిగిన సంగతులే భలే సంకటాలు తెచ్చాయప్పా.

పెద్దపెద్ద మెషిన్‌లో, అంతకన్నా పెద్ద శబ్దాలు చేస్తూ తవ్వారు. దినాలు పోతున్నాయి. నీళ్లూ లేవు- గీళ్లూ లేవు. సరే అక్కడ కాదు, ఇక్కడ తవ్వండి. ఇక్కడ కాదు, అక్కడంటూ పది చోట్ల ప్రయోగం చేసారు. నీళ్లేమొ రాలేదాయె. నాకు మూడు బ్యాంకిల్లో, మునసబుగారి దగ్గర, ఆఖరకు మా వియ్యంకుడి వద్ద వేలుకొద్ది అప్పులు. నీళ్లు రాలేదు. అందరూ బోర్‌వెల్ భైరప్ప అని ఇప్పుడు నన్ను పిలుస్తున్నారు. "ఒరేయ్ భైరా- ఈరోజు మనం బ్యాంకికి పోవాలా" అని మునసబు ఒక్కరోజు తీసుకెళ్లాడు. అప్పుడు జూసినానయ్యా ఈ సూపరెయిజర్నీ.. ఎదురుబడిన మనిషి. నీ పేరేమన్నడు. మునసబ్ చెప్పాడు. "బోర్‌వెల్ భైరా" అని. అరచేతిలో వయికుంటం చూపించి, నా చేను రాయించేసుకున్నాడు. ఆ మనిషి నన్నొదలలేదు. జీడి బంక మాదిరి తగులుకున్నాడు. తుమ్మ జిగురు మాదిరి!



సరే, ఒక్కరోజు నేనుండలేదు ఇంటిలో, వాడు కార్లొవచ్చి, ఆ బిడ్డ, పద్మను కార్లోనే వీడియొ సిన్మా వుంది చూస్తావా అని అడిగాటంట! ఈ తల్లి- ఏం తెలియని బిడ్డా- వెర్రి పద్మ, ఆ నా కొడుకుతో వెళ్లింది. ఇగంతే...

శ్రీనిగాడు ఉరేనుకుంటానని వెళ్లి, సావక, వేసుకున్న పద్మ చీరతో, ఆ ఇంటి కొయ్యి విరిగి పడితె, ఏడుస్తూ చెప్పాడు.

"సిన్మా చూపిస్తానని 'కారు' మనిషి పద్మను ఏమెమొ చేసాడంట! వూరంతా చెప్తున్నది" అంటూ ఏడుస్తూ వుంటే, నేను పద్మను చూసి కళ్లంట నీళ్లు బెట్టుకుని- నేనసలు ఎప్పుడూ ఏడ్చింది లేదు- "అమ్మా... నువ్వ మీ పుట్టింటికి వెళ్లిపోమ్మా" అని పంపించేసా. మరుసటిరోజే శీనిగాడు కూడ వలస వెళ్ళిపోయాడు- పట్నంలో కూలి చేసుకుంటా ఉంట!

కూలో...నాలో...పచ్చగా ఆలుమగలు జతగావుంటే బాగుండేది. ఎంత చక్కగా వుండేది! కాని నేను మాత్రం ఈ 'బోర్' అంతం చూస్తానని, బ్యాంక్ దగ్గరికెళ్లి ఇంకొంచెం అప్పు తీసుకొచ్చి, చేనులో బోరు వేయించా...నీళ్లు మాత్రం రాలేదు. అప్పులు... బోరు శబ్దాలు. నీళ్ల లేమి ఇలా ఎణ్ణర్దం దాటి గంగమ్మ జాతర కూడా వచ్చింది. ఎందుకో ఆ బిడ్డకు అనియాయం చేసాను అనిపించి వెళ్లి తీసుకొస్తానని, పద్మను పిల్చుకొచ్చాను. "వద్దప్పా ఆ బిడ్డను ఏమీ చేయవద్దు" అనిన వాళ్లమ్మ పై ఛూ అని ఉమ్మి, 'పద్మ నా బిడ్డ... దాన్నెవరో ఎమొ చేస్తే... నేను కూడ అలా పారేసుకుంటానా- రా బిడ్డ... ని ఇల్ల ఆడే" అని పద్మనూ, మనమరాల్నీ పిల్చుకొచ్చా.

ఈసారి ఆ బిడ్డ చేతితో పూజ చేయించి, అప్పు తెచ్చిన దుడ్లతో ఆఖరిసారిగా బోర్ తవ్విద్దాం అని బోర్ వేయించాను. ఇంటి చుట్టూరా అప్పుల వాళ్లు. మళ్లీ బోర్‌లో నీళ్లు పడలేదు. అప్పుల వాళ్ల నుండి తప్పించుకుని సంకటి తినటం మహా కష్టమైంది. సంకటిని వేళ్లలో పెట్టుకుంటే "బోర్‌ వెల్ భైరప్పా, నీ పని అయ్యిందప్పా" అనే నవ్వులు వినిపించేవి.

అప్పుడే ఎవ్వరో చెప్పారు- పబుత్వం ఆత్మహత్య చేసుకున్నవాళ్ల ఇంటిలో వారికి లక్షన్నర ఇస్తారని. మా పద్మమ్మకు కనీసం అప్పులు పోగ ఇంకొంచెం దుడ్లు మిగులుతాయి అని పురుగులమందు పొట్లం తీసుకొచ్చుకున్న. "బోర్‌వెల్ భైరప్పా... నీ పని అయ్యిందప్పా"

** ** **

పద్మ: ఈ యబ్బేమొ ఇట్లా కాళ్లు చాచుకుని పడుకున్నడు. పబుత్వం... అదే గోరమెంటు... దుడ్లు ఇస్తారన్నరు. కాని ఆ దుడ్లకన్నా నాకు ముఖ్యం నా కూతురు. దానిపేరు భైరమ్మా! ఈ భైరమ్మను నేన సది విస్తా... ఈ చేనును, ఈ నీళ్లను ఇగ నమ్మనంటే నమ్మను. ఆ బిడ్డ చదివి నన్నెక్కడైనా దూరంగా పట్నంలోనున్న నా మగడి దగ్గరికి చేర్చుతుందనే గట్టి నమ్మకమప్పా! ఎమొ ఏమైతుందో చూస్తాం!